

చిలకలూరిపేటలో సోమవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన పార్టీనేతలు విజయసాయిరెడ్డి, మంత్రి విడదల రజనీకు గజమాలతో ఆహ్వానం పలుకుతున్న పార్టీ కార్యకర్తలు



వేదికపై సంఘీభావం తెలుపుతున్న పార్టీ నాయకులు చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, రాజేష్‌నాయుడు, విజయసాయిరెడ్డి, మంత్రి రజని



సభలో నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడిని కార్యకర్తలకు పరిచయం చేస్తున్న పార్టీ నేత విజయసాయిరెడ్డి



సభలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని, వేదికపై నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు తదితరులు

# జగనన్న చెప్పారంటే.. చేస్తారంతే..

- పట్టణంలో ఘనంగా వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు
- స్వయం సహాయక మహిళలకు రూ.9.04 కోట్ల చెక్కు అందజేత
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన డ్వాక్రా మహిళలు
- దోచుకోవటమే చంద్రబాబు నైజమన్న నేతలు



టౌన్‌హాలులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, డ్వాక్రా మహిళలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చెప్పారంటే చేస్తారంతే అనే నానుడిని రుజువు చేశారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రకాష్‌నగర్ భువనచంద్రటౌన్ హాలులో 'వైఎస్ఆర్ ఆసరా 'వారోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. 2019 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నాటికి ఎస్ఎల్‌బీసీ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని 78,94,169 మంది డ్వాక్రా మహిళల పేరిట రూ.25,570.80 కోట్లు పొదుపు సంఘాల రుణాలు నాలుగేళ్లలో చెల్లించి మాఫీ చేశారన్నారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ మేరకు 2020 సెప్టెంబర్ 11న మొదట విడతగా రూ. 6,318.76 కోట్లు. 2021 అక్టోబరు ఏడున రెండో విడతగా రూ.6,439.52 కోట్లు. .2023 మార్చి 25న మూడో విడతగా రూ.6,417.69 కోట్లు చెల్లించాడన్నారు. 2024 జనవరి 23 నుంచి నాలుగో విడత రూ. 6,394.83 కోట్లు మహిళల ఖాతాలో జమ చేశారన్నారు. చంద్రబాబు రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాఫీ చేయకుండా మోసం చేయడంతో మహిళలు డీలా పడ్డారన్నారు. పురపాలక సంఘం పరిధిలో 1205 స్వయం సహాయక సంఘాలు వైఎస్సార్ ఆసరా పథకాన్ని పొందేందుకు అర్హత కలిగిన 11,185 మంది డ్వాక్రా మహిళలకు రూ.9.04 కోట్ల విలువ చేసే ఆసరా నాలుగో విడత రుణమాఫీ జరిగిందన్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో మొత్తం స్వయం సహాయక సంఘాలకు రూ.35.90 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. తన పాలనలో అనేక సంస్కరణలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచేలా అనేక నిర్ణయాలు తీసుకొని మహిళలకు అనేక పథకాల ద్వారా లబ్ధిచేకూర్చారన్నారు. తాను హామీ ఇచ్చిన మేరకు 98 శాతం వాగ్దానాలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం జగన్ డబ్బులు పంచుతున్నాడని చంద్రబాబు అతని భజన బృందం ప్రచారం చేశారని, ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల కింద డబ్బులు ఇచ్చాడే కాని అతనిలాగా దోచుకోలేదన్నారు. చంద్రబాబు ఏ పథకం అమలు చేయకుండానే రూ.2.69 లక్షల కోట్లు అప్పుచేశాడన్నారు. రూ.350 కోట్లతో పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మాత్రమే కట్టాడన్నారు. దళారీల వ్యవస్థకు ఆస్కారం లేకుండా సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు తీసుకొచ్చి ప్రజలకు పాలనను చేరువ చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసేసి జన్మభూమి కమిటీల పేరుతో దళారీ వ్యవస్థను తీసుకొస్తాడన్నారు. మహిళలపై నమ్మకంతోనే 175కు 175 సీట్లు వస్తాయని జగన్ ప్రకటించాడన్నారు.తన పాలనలో మేలు జరిగితేనే ఓటు వేయండన్న ఏకైక సీఎం జగన్ అన్నారు. చంద్రబాబు ఏనాడు ఆవిధంగా కోరలేదని గుర్తు చేశారు. మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగాను, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా పలు గ్రూపులకు చెందిన మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో పాటు ముదిరాజు, స్వచ్ఛాంధ్ర, గిరిజన, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, ఎస్.సుజాతాపాల్, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు, ఎనిమిదవ వార్డు నాయకుడు షేక్ కరిముల్లా రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు డ్వాక్రా సంఘ మహిళలను సన్మానించారు. కార్యక్రమానికి గృహసారథుల కన్వీనర్ ఎన్‌కే ఆంజనేయులు అధ్యక్షత వహించగా, మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, డ్వాక్రా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు డి.మాధవి, పూనూరి కృష్ణకుమారి, సయ్యద్ ఫాతిమా, మాజీ కౌన్సిలర్ సయ్యద్ మహబ్బీ, కారుమంచి మీరావలి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలలకు శానిటేషన్ లిక్విడ్ మంజూరు

**శావల్యాపురం:** మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా శానిటేషన్ నిమిత్తం మెటీరియల్ ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎంఈవో మద్దికుంట సాంబశివ రావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బాత్రూం క్లీనింగ్ లిక్విడ్-826 లీటర్ల, టాయిలెట్స్ బౌల్ క్లీనింగ్ లిక్విడ్ లీటర్ల-1062, ఎయిర్ ఫ్రెష్ నర్ లిక్విడ్-647 పాఠశాలలకు మంజూరు చేసినట్లు చెప్పారు. లైబ్రరీ పుస్తకాలు ఎంపీపీ స్కూలు 31 పాఠశాలలు-80, ప్రాథమికోన్నత పాఠశాలలు-3 గాను 29 పుస్తకాలు, జెడ్పీ ఉన్నత పాఠశాలలు -05 ఉండగా 179 గ్రంథాలయ పుస్తకాలు మంజూరు చేయగా అన్నీ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశామన్నారు.

## అక్రమ మద్యం కేసులో ఇద్దరి అరెస్ట్

**నరసరావుపేట టౌన్:** మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార సోమవారం తెలిపారు. ఉప్పలపాడు గ్రామంలో తనిఖీలు నిర్వహించి అక్కడ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఆదెమ్మను అరెస్ట్ చేశామన్నారు. ఆమె వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా కాకాని గ్రామంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా 11 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న జె. చంద్రను అరెస్ట్ మన్నారు. ఈ మేరకు ఇద్దరి నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

## క్లుప్తంగా

### పరగటిచర్లలో పల్లెనిద్ర



హాజరైన గ్రామస్తులు



మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

**రొంపిచర్ల:** గ్రామంలో ప్రజలు అందరూ ఐక్యమత్యంతో, సోదరభావంతో జీవించాలని ఎస్ఐ కె.పి.రవీంద్ర అన్నారు. మండలంలోని పరగటిచర్ల గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకు రావాలని ఆయన గ్రామస్తులతో చెప్పారు. ముఖ్యంగా తమ పిల్లలందరినీ మంచి చదువులు చదివించుకోవాలన్నారు. తగాదాలకు, ఘర్షణలకు వెళ్లి జీవితాలను పాడు చేసుకోవద్దని ఆయన గ్రామస్తులకు సూచించారు. విద్య వల్లే అభివృద్ధితో పాటు జీవితాలు సుఖమయం అవుతాయన్నారు.

### పేరూరుపాడులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


**బొల్లాపల్లి:** మండలంలోని పేరూరుపాడు గ్రామ సచివాలయం వద్ద వికసత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీ బాషా కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అమలు జరుగుతున్న విధానం గురించి, రాష్ట, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలుసద్వినియోగపరచుకోవాలని సూచించారు. పీఎం కిసాన్,ఆయుష్మాన్ భారత్, ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు, అవాస్ యోజన, విశ్వకర్మ ద్వారా చేతి వృత్తుల వారికి రూ.15 వేలు విలువ చేసే ఉపకరణాలు, మాతృత్వ యోజ న, బంగారు తల్లి, రేషన్ కార్డులు జారీ వంటి పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.స్వాతి, వైద్యులు వి. సాయితేజ, ఎంఈఓ 2 కె.పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఆర్.పద్మజారాణి సచివాలయ సిబ్బంది, యర్ర కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

### వైద్యశాలను తనిఖీ చేసిన వైద్యాధికారి



**రొంపిచర్ల:** మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి రవిరత్నాకర్ సోమవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వైద్యశాలకు వచ్చినట్లు తెలిపారు. రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మలేరియా, డెంగ్యూ జ్వరాల వ్యాప్తి, నివారణపై సమీక్షించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చేపట్టాల్సిన చర్యలను ఆయన సిబ్బందికి వివరించారు. ఈ సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ రేవతిబాయి, హెచ్ఈవో సురేష్ కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### వినుకొండలో సీఐ, కమిషనర్లకు సన్మానం



**వినుకొండ(నూజెండ్ల):** గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, పట్టణ సీఐ సాంబశివరావులను శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రి, రెడ్‌క్రాస్ సొసైటీ, వాసవీ క్లబ్ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, బెల్లంకొండ ప్రసాద్, నరసింహ, బైసాని సుబ్బారావు, ఉపేంద్ర, సీహెచ్. కోటేశ్వరరావు, ఎ. మోహన్‌రావు, పి.రాము, వెంకటేశ్వర్లు, రాము, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయి

- ఆ ఘనత జగనన్న ప్రభుత్వానిదే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- అగ్నిగుండాలలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

**ఈపూరు :** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని అగ్నిగుండాల గ్రామంలో గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్ర నూతన భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, గోదాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ పరిపాలన వ్యవస్థను తీసుకొచ్చి 1.30 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలు అందాలని నేరుగా వారి ఖాతాల్లోకే డబ్బులను జమ చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజీ హెల్త్ క్లినిక్ వంటి పక్కా భవనాలను నిర్మించి వాటి ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. నేడు ఏ పని కావాలన్నా ప్రజలు తమ గ్రామంలోనే చేయించుకోవచ్చని, ఒకప్పుడు రైతు విత్తనాల కోసం, ఎరువుల కోసం కిలోమీటర్ల కొద్ది పోవాల్సి వచ్చేదని, ప్రస్తుతం గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని ఆయన అన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలు గమనించి ప్రజామద్దతు తెలపాలని కోరారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న జీవీ ఆంజనేయులు నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని, పదవిని తన స్వార్థానికి వినియోగించుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రంగులు వేసి బయో ఎరువులు అంటూ రైతులను బిత్తరపెడుతూ వారిని మోసం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ముఖ్యులు చూసి సంక్షేమం అందజేసి అర్హులకు అన్యాయం చేశారన్నారు. నేడు ఆ పరిస్థితి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ నగదును ప్రభుత్వం అందజేస్తుందని గుర్తు చేశారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తుంటే అబద్ధపు ప్రచారాలతో బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో పెత్తందారులకు పేద ప్రజలకు యుద్ధం జరుగుతుందని, ఆ యుద్ధంలో ప్రజలు మంచి వైపు అడుగులు వేయాలని కోరారు. అనంతరం సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు స్థలాలను ఉచితంగా అందజేసిన దాతను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బెంగళూరు మేఘన ఫుడ్స్ అధినేత బొల్లా రమేష్ , మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, జెడ్పీటీసీ చౌడయ్య, గ్రామ సర్పంచ్ దూదేకుల మస్తానీ, ఎనిమిరెడ్డి అంకిరెడ్డి, మూలె అంకిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, ఏడుకొండలు రెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

**వినుకొండ (నూజెండ్ల):** నూజెండ్ల మండలం మారెళ్లవారిపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు బత్తుల వెంకటేష్, బత్తుల రామారావులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్న వారికి ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా అభివృద్ధి చూసి, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో నూజెండ్ల మండలంలోని టీడీపీ కంచుకోటగా ఉండే గురప్పనయుడి పాలెం, టి.అన్నారం, గణేషునిపాలెం, కొప్పుకొండ గ్రామాల్లో సైతం తమ పార్టీలో వందల మంది టీడీపీ కార్యకర్తలు చేరడం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలను ఆకర్షిస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేసి మరల జగనన్న విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు తమ కుటుంబ సభ్యులుగా భావించి అన్నీ విధాల ప్రాధాన్యతనిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ గొడవలు ప్రోత్సహిస్తోంది!

ప్రజల్లో ఆదరణ కోల్పోయిన టీడీపీ గొడవలను ప్రోత్సహించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల టీడీపీ వర్గీయుల దాడుల్లో గాయపడి చికిత్స పొందుతున్న పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్ స్వగృహంలో ఇరువురు ఎమ్మెల్యేలు పరామర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కావాలనే గొడవలు సృష్టిస్తున్నారని, అమాయకులైన యువకులు రాజకీయాలకు బలికావద్దని కోరారు. వారి వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

### గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడమే ఆడుదాం ఆంధ్రా

**వినుకొండ (నూజెండ్ల):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీల్లో పురుషుల విభాగంలో ఈపూరు మండలం, బ్యాడ్మింటన్‌లో వినుకొండ మండలం, వాలిబాల్ వినుకొండ, మహిళ విభాగం క్రికెట్ కావ్యాపురం, బ్యాడ్మింటన్, ఖోఖో, ఇతర క్రీడల్లో విజయం సాధించిన జట్లకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బహుమతులు, షీల్డ్, మెడల్స్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ శివారెడ్డి, ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ బాలిరెడ్డిలతోపాటు, వార్డు కౌన్సిలర్లు, ఐదు మండలాల ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో, అధికారులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో రెండు పూరిళ్లు దగ్ధం

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాధితులకు వితరణ



బాధితులకు నిత్యావసరాలు వితరణ చేస్తున్న పార్టీ నాయకులు

**బొల్లాపల్లి :** విద్యుదాఘాతంతో రెండు పూరిళ్లు దగ్ధమైన సంఘటన మండలంలోని పలుకూరు పంచాయతీ శివారు రామాపురంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. బాధితుల కథనం మేరకు గ్రామానికి చెందిన పల్లెబోయిన పీరయ్య ఇంటిపై విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు ఎగసిపడి పక్కనే ఉన్న రామాంజనేయులు పూరింటికి వ్యాప్తి చెందిన అగ్నికీలలు ఎగిసిపడి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులతో పాటు నగదు పూర్తి అగ్నికి ఆహుతయ్యాయని సర్వం కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పీరయ్య ఇంట్లోని సిలెండర్ పేలడంతో ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. తెల్లవారుజామున నిద్రమత్తులో ఉన్నవారు మంటలను గమనించి బయటకు రావడంతో పెనుప్రమాదం నుంచి బయటపడినట్లు బాధితులు వాపోయారు. సమాచారం మేరకు అగ్నిమాపక వాహనం చుట్టుపక్కల వారు మంటలను అదుపులోకి తెచ్చారు. పీరయ్య ఇంట్లో రూ.1.30 లక్షల నగదుతో పాటు ఇతరత్రా గృహోపకరణాలు కలిపి రూ.3 లక్షలు, రామాంజనేయులుకు చెందిన రూ.50 వేలు నగదుతో పాటు రూ.2.50 లక్షల విలువ చేసే గృహోపకరణాలు ఈ ప్రమాదంలో దగ్ధమయ్యాయని రెవెన్యూ అధికారులు సందర్శించి ఆస్తి నష్టం అంచనా వేశారు. సమాచారాన్ని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ యువనేత బొల్లా గిరిబాబు, మండల పార్టీ నాయకులు సంఘటనా ప్రాంతాన్ని సందర్శించారు. బాధితులను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువనేత గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని అందేలా చూస్తామని తెలిపారు. బాధితులకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బియ్యం, దుస్తులు, వంటపాత్రలు, నగదు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎం.రాజయ్య, బి.గురవయ్య, పార్టీ నాయకులు షేక్ ఖాశీం, బి.గోవిందయ్య ఉన్నారు.

# సామాజిక యాత్రకు భారీగా..




యడ్లపాడు గ్రామంలో సామాజిక యాత్రను పార్టీ జెండా ఊపి ప్రారంభిస్తున్న నాయకులు

**యడ్లపాడు:** సామాజిక సాధికార బస్సుకు యడ్లపాడు మండలం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రమైన యడ్లపాడులో పార్టీ అధ్యక్షులు పతాకాన్ని ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అన్ని గ్రామాల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పార్టీ పతాకాలను కట్టుకుని జై జగన్..జైజై మల్లెల రాజేష్‌నాయుడు అంటూ నినాదాలు చేస్తూ ఎంతో ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు. సభ సాయంత్రం అయినప్పటికైనా ప్రార్టీ శ్రేణులు, ప్రజలు మధ్యాహ్నం నుంచే తరలి వెళ్లడం విశేషం. చిలకలూరిపేట పట్టణంలో కొత్త వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి పాదయాత్రలో పాల్గొని అక్కడ నుంచి కళామందిర్ సెంటర్లో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులో పార్టీ అధ్యక్షులు ఘంటా శంకర్, సేవాదళ్ జిల్లా కార్యదర్శి కల్లూరి విజయ్‌కుమార్, జేసీసీ కన్వీనర్ రాచమంటి చింతారావు, నాగమల్లేశ్వరరావు, చాగంటి శ్రీధర్ తదితరులు ఉండగా ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తరలి వెళ్లారు.

### మహిళల అనూహ్య స్పందన

**యడ్లపాడు:** వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామాజిక సాధికార బస్సు యాత్రకు మహిళల్లో విశేష స్పందన లభించింది. సోమవారం చిలకలూరిపేట పట్టణంలో బస్సుయాత్రతో పాటు కళామందిర్ సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు కార్యక్రమం ప్రారంభానికి రెండు గంటల ముందే జాతీయ రహదారి పక్కనే ఉన్న కొత్త వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఆటోల్లో పట్టణ వాసులతో పాటు నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల నుంచి భారీగా తరలి వచ్చారు.

# భారీగా తరలివచ్చిన శ్రేణులు



గణపవరంలో ర్యాలీగా వస్తున్న కార్యకర్తలు

**నాదెండ్ల:** చిలకలూరిపేటలో జరిగిన సామాజిక సాధికారిత బస్సు యాత్రకు విశేష స్పందన లభించింది. అన్ని గ్రామాల నుంచి భారీఎత్తున ప్రజలు తరలి వచ్చారు. మండలంలో రెండు వందలతో పైగా ఆటోలు సుమారు 2వేల బైకులు, 50 ట్రాక్టర్లు, 100 జీపులతో తరలివచ్చారు. మేజర్ పంచాయతీ గణపవరం నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. వాహనాలకు పార్టీ జెండాలు పెట్టుకుని నినాదాలు చేస్తూ వెళ్లారు. ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాయకులు కాట్రు రమేష్, కెల్లంపల్లి సుందరరావు, తులం సుధాకర్, ఆదం వలి, కాటా వెంకటేశ్వర్లు, సింగారెడ్డి కోటిరెడ్డిల ఆధ్వర్యంలో ప్రజలు తరలివచ్చారు.

# దుకాణాల తాళాలు పగులగొట్టి...

- నరసరావుపేటలో చోరీకి యత్నం
- అర్ధరాత్రి దొంగల హల్‌చల్

**నరసరావుపేట టౌన్:** పట్టణంలోని పలు దుకాణాలకు తాళాలు పగులగొట్టి చోరీకి ప్రయత్నించిన సంఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు బస్టాండ్, మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మున్సిపల్ దుకాణ సముదాయం ఉంది. అందులో పలు చిరువ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తూ ఉంటారు. దుకాణ యజమానులు రోజూ మాదిరిగానే తమ దుకాణాలను ఆదివారం సాయంత్రం మూసివేసి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి వరుసగా ఉన్న ఐదు దుకాణాల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆందోళనలు చెందిన యజమానులు షట్టర్‌లు తీసి దుకాణాలను పరిశీలించారు. అయితే ఎటువంటి వస్తువులు అపహరణకు గురికాకపోవటంతో యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ భాస్కర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరులు పగులగొట్టిన తాళాలను పరిశీలించారు. జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేయాలని యజమానులకు చెప్పారు. దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.